క్లుప్తంగా

విద్యుత్ కార్యాలయంలో ఆయుధపూజ



చంద్రగిరి: సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విదుదల మాధవరెడ్డి, ఏడీఈ శేషారెడ్డిలు పాల్గొన్నారు. ముందుగా కార్యాలయం వద్ద అమ్మవారిని చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం సిబ్బందికి ప్రసాదాలను పంపిణీ చేశారు. ఏఈలు నాగరాజు, హరిప్రసాద్, రజిని ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఈ- ఆన్ లైన్ డ్రా ద్వారా ప్లాట్లు కేటాయింపు

– 90 ప్లాట్లకు 266 మంది దరఖాస్తు



మాట్లాడుతున్న తుడా వీసీ హరికృష్ణ

తిరుపతి తుడా: తిరుపతి జిల్లా చంద్రగిరి– బెంగళూరు ఆరు లైన్ల జాతీయ రహదారికి సమీపంలో రూపుదిద్దుకున్న జగనన్న టౌన్ షిప్(ఎమ్ఐజీ లే ఔట్) ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి అయ్యింది. శుక్రవారం తుడా కార్యాలయం వేదికగా వీసీ హరికృష్ణ, ఇతర విభాగాధిపతుల సమక్షంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ ఈ ఆన్ లైన్ డ్రా నిర్వహించారు. మొత్తం 90 ప్లాట్లకు 266 మంది దరఖాస్తు చేసుకున్నారని వీసీ పేర్కొన్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులకు 9 ప్లాట్లు, పెన్షనర్లకు 5 ప్లాట్లు కేటాయించామన్నారు. అలాగే జనరల్ కేటగిరీలో 76 మందికి కేటాయించినట్లు వెల్లడించారు. ఈ సమాచారం ఆయా లబ్ధిదారులకు ఫోన్‌లో సమాచారం వస్తుందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులు 30 రోజుల్లో ప్లాట్కు చెల్లించాల్సిన మొత్తం ధర చెల్లించినట్లైతే నిబంధనల మేరకు 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. వివరాలకు తుడా కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చు. తుడా ప్రణాళిక విభాగం అధికారి శ్రీనివాసులు రెడ్డి, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, ఎంపిడిఓలు రమేష్‌బాబు, బాలాజీ నాయక్‌లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు





రాష్ట్రంలోనే ఆదర్శంగా చంద్రగిరి

- రూ.150కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి
- తుడా నిధులతో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రణాళిక
- ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి

చంద్రగిరి: ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంతోపాటు అభివృద్ధి వైపు దూసుకెళ్తూ రాష్ట్రంలోనే చంద్రగిరి నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తోందని ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించే సమయంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని, ప్రజాప్రతినిధులకు కనీసం సమాచారం లేకుండా మమ అనిపించేస్తున్నారన్నారు. తొండవాడ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. చంద్రగిరికి టౌన్ బస్సులు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చంద్రగిరి ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తన భూమిలో అక్రమంగా రోడ్డు ఏర్పాటు చేసుకున్నారని తనకు న్యాయం చేయకుండా అధికారులు అలసత్వం వహిస్తున్నారంటూ ఎంపీటీసీ సుజాత ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మరో నాలుగు రోజుల్లో సమావేశం నిర్వహించి, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ శిరీష తెలిపారు. ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ మండల సమావేశానికి హాజరుకాని వారికి నోటీసులు జారీ చేయాలంటూ ఎంపీడీఓ బాలాజీ నాయక్‌ను కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సహకారంతో ఇప్పటి వరకు రూ.150 కోట్లతో గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. నూతన మండల పరిషత్ కార్యాలయం నిర్మాణాన్ని తుడా నిధులతో పండుగలోపు పనులను ప్రారంభిస్తామని తెలిపారు. త్వరలోనే చంద్రగిరి–తిరుపతి మీదుగా 5 ఎలక్ట్రిక్ బస్సులను కూడా ఆర్టీసీ నడిపేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సభ్యులు కరతాళ ధ్వనులతో ధన్యవాదాలు తెలిపారు.

రమేష్‌బాబుకు ఘన వీడ్కోలు

చంద్రగిరి నుంచి తిరుపతి రూరల్ ఎంపీడీఓగా బదిలీపై వెళ్లిన రమేష్‌బాబుకు ఎంపిపి హేమేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈఓపీఆర్డీ శశిరేఖ, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, ఎంఈఓ లలిత కుమారి, ఏఈఓలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కల సాకారం



బాలచంద్ర, సెక్రటరీ, తిరుపతి ప్రెస్ క్లబ్

తిరుపతి తుడా: ఇళ్ల స్థలాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న జర్నలిస్టుల కలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేబినెట్లో నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తిరుపతి ప్రెస్‌క్లబ్ సెక్రటరీ బాలచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు మూడు సెంట్లు వరకు ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ విషయం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. సీనియారిటీని ఐదేళ్లకు కుదించడంతో ఎక్కువ మందికి లబ్ధి చేకూరనుందని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం యావత్ జర్నలిస్టు కుటుంబాల్లో ఎంతో ఆనందాన్ని నింపిందన్నారు. దాదాపు 16 ఏళ్ల తర్వాత జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో ఎట్టకేలకు జర్నలిస్టుల ప్రార్థనలు ఫలించాయన్నారు. జర్నలిస్టులకు సంక్రాంతి కానుకను ముందే ప్రకటించిన సీఎంకు జర్నలిస్టులందరి తరపున కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. ఇందుకు సహకరించిన సమాచార శాఖ మంత్రితోపాటు డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను పంపిణీ



ఐసీయూలో పింఛను అందుకున్న సింగు మునికృష్ణ నాయుడు

చంద్రగిరి: కొద్ది రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సింగు మునికృష్ణ నాయుడుకు సకాలంలో పింఛను అందించడంతో ఆనందం వ్యక్తం చేశాడు. కొటాల పంచాయతీకి చెందిన సింగు మునికృష్ణ నాయుడు గత వారం రోజులుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. సమాచారం అందుకున్న సర్పంచ్ గుంగులమ్మ, ఎంపీటీసీ మధు, స్థానిక నాయకులు మునికృష్ణ, మురళీ నాయుడులతో కలసి వలంటీర్‌ను వెంటబెట్టుకుని ఐసీయులో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడికి పింఛను అందించారు. ఈ సందర్భంగా సింగు మునికృష్ణ నాయడు భావోద్వేగానికి లోనయ్యాడు. ఆపత్కాలాన్ని గుర్తించి పింఛను అందించిన జగనన్న ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా శ్రీజన్మస్థల శివాలయ పునర్నిర్మాణ భూమి పూజ



రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లి పంచాయతీ రేకలచేను గ్రామంలో ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో సమరసతా సేవా ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం శ్రీజన్మస్థల శివాలయ పునర్నిర్మాణ భూమి పూజ వైభవంగా నిర్వహించారు. 101 మంది వేద పండితులతో యజ్ఞయాగాది క్రతువులు జరిపించారు. పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ట్రస్ట్ చైర్మన్ గురునాథరెడ్డి, సమరసతా సేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు, వెదురుకుప్పం ఎంపీపీ సుమతి, నాగరాణి, హేమసుందర్ రెడ్డి, సోమేశ్వర్, శివ, భక్తులు పాల్గొన్నారు.

రేపు బీసీ ఉద్యోగుల మహాసభ

తిరుపతి కల్చరల్: బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సంస్కృత విద్యాపీఠం వద్దనున్న ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగే బీసీ ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలని బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంకీపురం పవన్ పిలుపు నిచ్చారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభకు బీసీ ఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టా భాస్కర్ హాజరు కానున్నారని, బీసీ ఉద్యోగులందరూ ఐక్యతతో హాజరై ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ ఈఎఫ్ నేతలు శ్రీనివాసులు, సునీల్ దత్, తులసి రామ్, టి.గోపాల్, కిరణ్, ముని కేశవులు, గిరి, శ్రీనివాస్‌ఖ, విజయకుమార్ పాల్గొన్నారు.

ఉల్లి అక్రమ నిల్వలు బయటకు తీయాలి



గోదాము వద్ద ధర్నా చేపడుతున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: ఉల్లి అక్రమ నిల్వలు ఉన్న గోదాములపై చర్యలు తీసుకొని బయటకు తీయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఉల్లి గోదాము వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలు కొనలేని విధంగా ఉల్లి రేట్లు పెరిగిపోయాయని, ఉల్లి రేట్లు మార్కెట్లో రూ.90 ఉందని పేర్కొన్నారు. అధికారులు ఉల్లి నిల్వలను బయటకు తీసుకొచ్చి ప్రజలకు సబ్సిడీ రూపంలో పంపిణీ చేయాలని కోరారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో గోదాములపై దాడి చేసి ప్రజలకు పంచుతామని హెచ్చరించారు. సీపీఐ నేతలు విశ్వనాథ్, కె.రాధాకృష్ణ, ఎం.శివ, ఎన్‌డీ.రవి, కేవై.రాజా, రామకృష్ణ, పద్మనాభరెడ్డి, రత్నమ్మ, నాగరాజు, నవీన్, హరికృష్ణ, మునీశ్వర్, వెంకటేష్, సురేష్ ప్రమీల పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణుల ఆరోగ్యానికి సంజీవని అని తుమ్మలగుంట సర్పంచ్ నల్లందుల సుబ్బరామిరెడ్డి కొనియాడారు. తుమ్మలగుంట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన నిపుణులైన 8 మంది వైద్య బృందం గ్రామస్తులకు వివిధ రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించారు. 527 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 107 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, కంటిచూపు సమస్యతో బాధపడుతున్న 37 మందికి కంటి అద్దాలను ఉచితంగా అందించారు. 11 మందిని వివిధ శస్త్ర చికిత్సల కోసం రిఫర్ చేశారు.

రేపు శ్వాసకోశ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం

తిరుపతి కల్చరల్: డీబీఆర్ రోడ్డు, కొర్లగుంట, మారుతీనగర్‌లోని నారాయణ కళాశాల వెనుకనున్న ఎస్వీ అలెర్జీ అండ్ చెస్ట్ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్వాసకోశ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ హాస్పిటల్ ఎండీ, ప్రముఖ శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఎస్.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కంప్యూటరైజ్డ్ పీఎఫ్‌టీ, ఎక్స్‌రే, ఈసీజీ, బ్లడ్ షుగర్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఇన్‌హేలర్స్, ఇతర మందులు ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరంలో పాల్గొదలచిన వారు 0877–2254208, 7416110259 నెంబర్లలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.